క్లుప్తంగా

సీతారామ ఆలయ పునఃప్రతిష్ఠ

మలికిపురం: స్థానిక పద్మశాలీపేటలో సీతారామ ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. స్థల దాతలు గోపరాజు జవహర్ లాల్–శివ జ్యోతి దంపతులతోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఉదయం నుంచీ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన జరిగింది. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు పాల్గొన్నారు.

వైభవంగా పాళ్లమ్మ వార్షికోత్సవం



ఈదరాడలో పాళ్లమ్మ వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: ఈదరాడ గ్రామ దేవత శ్రీపాళ్లమ్మ అమ్మవారికి వార్షికోత్సవం పూజలను ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా సోమవారం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మ వారికి వెండిచీరతో విశేష అలంకరణ చేశారు. వేద పండితులు పూజ్యం జగన్నాథశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. అమ్మ వారికి సామూహిక కుంమార్చన, పూజలు చేశారు. ఆలయ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు సకల సదుపాయాలు కల్పించారు.

ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం కోసం వైద్య పరీక్షలు చేయించుకోవాలని అంబాజీపేట వైద్యాధికారి కె.ఎస్.శ్రీనివాస్ అన్నారు. మాచవరం పంచాయతీ కార్యాలయం వద్ద సీహెచ్‌ఓ బి.అప్పారావు అధ్యక్షతన ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. దీర్ఘకాలిక రోగులతో పాటు, ఇతర రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ



పాఠశాలకు కంప్యూటర్ అందించిన పూర్వ విద్యార్థులు

మలికిపురం: గుడిమెళ్లంక పాఠశాల పూర్వ విద్యార్థులు రేకపల్లి హనుమంతరావు శిష్యులు 2007–08 బ్యాచ్ ప్రాథమిక పాఠశాలకు రూ.25,000 విలువ గల కంప్యూటర్ బహూకరించారు. గ్రామ పెద్దలు రంగరాజు, సర్పంచ్ నల్లి విజయకుమారి, ప్రసాద్, ఎంఈఓ–2 వైవీవీ సత్యనారాయణ చేతుల మీదుగా కంప్యూటర్ అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం గాదె నాగేశ్వరరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు దాతలను సర్పంచ్ విజయ కుమారి అభినందించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అంబాజీపేట: ముక్కామల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకూ విద్యుత సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు ప్రకటనలో తెలిపారు. ముక్కామల, నేదునూరు, ఇరుసుమండ, పుల్లేటికుర్రు, కముజువారిలంక, వక్కలంక, పసుపల్లి, చినలంక, చిరతపూడి, మోడేకుర్రు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేపట్టనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతులకు విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియ ప్రారంభం

రాజోలు: సొంత భూమి ఉన్న రైతులందరికీ విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను ప్రారంభించినట్టు మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్ సోమవారం తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద తమ భూమి వివరాల ధృవీకరణ పత్రాలు తీసుకుని వెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. విశిష్ట సంఖ్య ద్వారానే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు.

పోలీస్ స్టేషన్‌లో వాహనాలను క్లెయిమ్ చేసుకోవాలి

అయినవిల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉన్న నాలుగు మోటారుసైకిళ్లు, ఓ ట్రక్కు ఆటోను వాటి యజమానులు తమ ఒరిజనల్ రికార్డులను చూపించి స్వాధీనం చేసుకోవాలని ఎస్సై కె.మనోహర్‌జోషి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వీటిలో ఏపీ 25ఎం 6942 నంబర్ హీరో హోండా స్ప్లెండర్, టీవీఎస్ స్టార్ సిటీ, ఏపీ 35 జే 3805 నంబర్ డిస్కవర్–100, టీఎస్08 ఈఎన్ 8756 నంబర్ ఎస్‌సీటీఎస్ మోటార్ సైకిళ్లతో పాటు ఏపీ31 టీబీ 8431 నంబర్ మహీంద్ర మాగ్జిమా ట్రక్ ఆటో ఉన్నాయని వివరించారు. వీటిని ఎవరూ క్లెయిమ్ చేయకుంటే బహిరంగ వేలం వేస్తామని ఆయన తెలిపారు.

మూషికం.. జరభద్రం

- రబీలో విజృంభిస్తున్న ఎలుకలు
- పిలక దశలోనే ధ్వంసమవుతున్న పంట
- అన్నదాతల్లో సర్వత్రా ఆందోళన



వరి పొలంలో పొగపెట్టే విధానంలో ఎలుకలను పడుతున్న కార్మికులు

ఆలమూరు: అన్నదాతలకు రబీ సాగులోనూ కష్టాలు వెంటాడుతున్నాయి. వ్యవసాయశాఖ అస్తవ్యస్త విధానాలతో పాటు ప్రకృతి వైపరీత్యాలు తరచూ వేధిస్తున్నాయి. ఈఏడాది రబీ సీజన్ ఆలస్యంగా ప్రారంభం కావడంతో ఆందోళనలో ఉన్న రైతులకు ఎలుకల బెడద ప్రాణసంకటంగా మారింది. ప్రస్తుతం పిలక దశలో ఉన్న వరి పంటపై మూషికాల దాడి అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తోంది. వ్యవసాయ రంగంలో అనేక సమస్యలు ఎదుర్కొంటూ పకృతి పరంగా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో మూషికాల దాడి కలవర పరుస్తోంది. ప్రారంభ దశలోనే తీవ్ర నష్ట పరుస్తున్న మూషికాలు పంట చేతికొచ్చే సమయానికి మరింత నష్టాన్ని చేకూర్చుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో సుమారు 58 వేల ఎకరాల్లో రబీ సాగు జరుగుతోంది. ఇప్పటికే రబీలో సుమారు 80 శాతం మేర వెదజల్లు సాగును చేపట్టగా మిగిలిన పొలాల్లో సాధారణ పద్ధతిలో వరినాట్లు వేశారు. ఈరబీ సీజన్‌లో రైతులు అధిక విస్తీర్ణంలో ఎంటీయు 3626 (బొండాలు) రకాన్ని, తక్కువ విస్తీర్ణంలో ఎంటీయూ 1001, ఎంటీయూ 1010 తదితర రకాలను సాగు చేశారు.

ఎలుకల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తప్పనిసరి

ఖరీఫ్, రబీ సీజన్‌లలో వ్యవసాయశాఖ ఏటా ఇప్పటికే తొలి దశలో ఎలుకల నివారణకు బ్రోమోడలియోన్ మందును నూకలు, నూనె మిశ్రమంతో కలిపి రైతులకు ఉచితంగా సరఫరా చేయాల్సి ఉంది. ఇంకా ఈ పక్రియ పూర్తిస్థాయిలో ప్రారంభం కావడంతో పంట పొలాల్లో మూషికాల బెడద ఎక్కువై పంటను కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. తీవ్రంగా నష్ట పరుస్తున్న ఎలుకల నివారణకు సత్వరమే ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పంట పొలాల్లో ఎలుకలు తినే దాని కన్నా దాదాపు పదిరెట్లు పంటను పాడు చేసే అవకాశం ఉంది. దీంతో పిలుక దశలోనే ఎలుకలను నిర్మూలిస్తే చిరు పొట్ట దశకు చేరుకునే సరికి వరి పంటకు సంబంధించి నష్టాన్ని తగ్గించ వచ్చని రైతులు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయశాఖ స్పందించి ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును అందరికీ అందుబాటులో ఉంచాలి.

ఎలుకల పట్టివేతకు అధిక వ్యయం

పంట పొలాలను నాశనం చేస్తున్న ఎలుకలను సాంప్రదాయంగా పట్టించేందుకు అధిక వ్యయమవుతోంది. చిలుకలు పండ్లను కొరికినట్టు మాదిరిగా ఎలుకలు వరి దుబ్బులను కొరకడంతో పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. రైతు వరిపంటను పూర్తిస్థాయిలో రక్షించాలను కుంటే తప్పనసరిగా ఎలుకలను నివారించాల్సి ఉంది. దీంతో రైతులు ఏవిధంగానైనా ఎలుకలను నిర్మూలించేందుకు ఎంత ఖర్చుకైనా వెనుకాడడంలేదు. రైతులు బుట్టల సహాయంతో ఎలుకలకు, పొగపెట్టే విధానంపై మొగ్గు చూపుతున్నారు. ఒక ఎకరం భూమిలో సరాసరి సుమారు 50 ఎలుకలకు పైగా పట్టివేత జరుగుతుండగా ఒక్కొక్క ఎలుకకు కార్మికులు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. దీంతో ఎకరాకు ఎలుకల నివారణకే రూ.మూడు వేల వరకూ ఖర్చు అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎలుకల బెడద ఎక్కువగా ఉండడంతో ఎలుకలు పట్టేవారికి అదే స్థాయిలో డిమాండ్ చేస్తున్నారు. అందుకే ఏటా మాదిరి గానే ప్రభుత్వం చిరుపొట్ట దశకు ముందుగానే ఎలుకల నివారణకు వ్యవసాయశాఖ సహకరించాలని రైతులు కోరుతున్నారు.

మూషికాల బెడదను నివారిస్తాం



పంట పొలాల్లో అధికంగా ఉన్న మూషికాల బెడదను నివారించి రైతులకు సొంతన చేకూర్చుందేకు చర్యలు తీసుకుంటున్నాం. ఎలుకల ఉధృతిని నివారించేందుకు బ్రోమోడయోలిన్ మందును రైతులకు సరఫరా చేస్తాం .

– ఎస్.లక్ష్మీ లావణ్య, మండల వ్యవసాయాధికారి, ఆలమూరు

ఎలుకల బెడద ఎక్కువే



రబీ సీజన్‌కు సంబంధించి అన్ని గ్రామాల్లో ఎలుకల బెడద ఎక్కువగా ఉంది. దీంతో ఎలుకల నిర్మూలనకు పూర్వ సంప్రదాయ రీతికి అనుగుణంగా ఎలుకల కన్నాల్లో పొగను నింపి ఎలుకలను నిర్మూలిస్తున్నాం, ఈ విధానంతో ఎలుకలను ఎక్కువ శాతం ఏం చేయలేము.

– ఈ.వెంకన్న, రైతు

సీహెచ్‌సీలో అందుబాటులో గుండెపోటు ఇంజెక్షన్

పి.గన్నవరం: గుండె సమస్యలతో బాధపడుతున్న రోగులు హఠాత్తుగా గుండెపోటుకు గురైతే వారికి సత్వరమే వైద్యం అందించేందుకు ఉచిత ఇంజెక్షన్ స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉంచినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రరావు తెలిపారు. గుండెపోటు సంభవించిన రోగిని ప్రాణాపాయం నుంచి రక్షించేందుకు రూ.40 వేల విలువైన టెనెక్ట్‌ప్లేస్ అనే ఇంజెక్షన్‌ను ఉచితంగా అందించనున్నట్టు తెలిపారు. సోమవారం ఆయన సీహెచ్‌సీలో రోగులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. సీహెచ్‌సీలో మొత్తం రెండు ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు.

గీత కార్మికుల మద్యం షాపుల ఎంపిక వాయిదా

ఆలమూరు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ దృష్ట్యా సోమవారం జరగవలసిన గీత కార్మికుల మద్యం షాపుల ఎంపిక వాయిదా పడిందని ఆలమూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఐడీ నాగేశ్వరరావు తెలిపారు. ఈసందర్భంగా స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో మంజూరైన మూడు మద్యం షాపులకు 84 దరఖాస్తులు రాగా వాటన్నింటిని పరిశీలించామన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే ఎంపిక తేదీని ఖరారు చేస్తామని ఉన్నతాధికారులు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అంబాజీపేట: ఇంటి డాబా మెట్లు ఎక్కుతుండా ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముక్కామల సినిమా రోడ్‌కు చెందిన నేదునూరి వెంకటేశ్వరరావు (62) ఈ నెల 8వ తేదీన తన ఇంటి వద్ద డాబా మెట్లపై నడుస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోవడవంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. దాంతో అతని కుటుంబ సభ్యులు, స్థానికులు అమలాపురం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. మృతుడి కుమారుడు నేదునూరి నాగమల్లేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ జెడీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు.

ఆత్మ విశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలి



అవిడి పాఠశాలలో 'పరీక్షా పే చర్చ' కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎంఈఓ హరిప్రసాద్

కొత్తపేట: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచనలను పరిగణలోకి తీసుకుని విద్యార్థులు ఆత్మవిశ్వాసంలో పరీక్షలకు సిద్ధం కావాలని ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కే లీలావతి సూచించారు. పీఎం నరేంద్రమోదీ ›పరీక్షా పే చర్చ‹ 2025 లో భాగంగా విద్యార్థులతో చేపట్టిన సంభాషణా కార్యక్రమాన్ని మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు వీక్షించారు. మండల పరిధిలోని అవిడి చప్పిడివారి పాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం మోడీ చెప్పిన విధంగా విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, యోగా, ధ్యానం చేయడం ద్వారా నిబద్ధత, సామర్థ్యం పెరిగి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. పరీక్ష అంటే భయపడకుండా మీ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించాల్సిన సమయంగా భావించి ఆత్మ విశ్వాసంతో పరీక్షలను ఎదుర్కోవాలని ఉద్బోధించారు.

ప్రమాద బాధితులకు సాయం



బాధితుల బంధువులకు సాయం అందజేస్తున్న కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన తల్లి కొడుకులకు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు సోమవారం రూ.12 వేలు నగదు సాయాన్ని అందించారు. అమలాపురం పట్టణానికి చెందిన మానుపటి దుర్గ వారం రోజుల క్రితం తన ఇద్దరు కొడుకులతో ఆటోలో ప్రయాణిస్తుండగా అమలాపురం దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్గకి తల, చెవికి తీవ్ర గాయాలయ్యాయి. ఒక కొడుకుకి కాలు, మరోక కొడుకుకి చెయ్యి విరిగిపోయాయి. బంధువులు చేసిన సహాయంతో ఇప్పటి వరకు రూ.2 లక్షలు వరకు ఖర్చు పెట్టి వైద్యం పొందుతున్నారు. హోటల్‌లో పని చేసే దుర్గ భర్తకి అంత ఆర్థిక స్థోమత లేకపోవడంతో బంధువులు స్థానిక కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరారు. దీంతో రావులపాలెంలో దుర్గ తమ్ముడు నాగరాజుకు సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.12 వేలు చెక్కును అందజేశారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి



బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఆలమూరు: చింతలూరులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 17 నుంచి జరగనున్న ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ తెలిపింది. స్థానిక ఆలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు అల్లంరాజు రామకృష్ణమూర్తి, ద్విభాష్యం కాశీ విశ్వనాథశర్మ, అల్లంరాజు భరణీకుమార్ ప్రసంగించారు. టీటీడీ తరహాలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పాంచాహ్నిక పద్ధతిలో ఐదు రోజుల పాటు ఈ బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నామన్నారు. ఈనెల 17న శేష వాహనం, 18న గరుడ వాహనం, 19న గజ వాహనం, 20న హనుమత్ వాహనం, 21న కల్పవృక్ష ముత్యాల పందిరి వాహనంలో దేవతామూర్తుల విగ్రహాలకు గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నామన్నారు. ఈనెల 22న జరిగే పూర్ణాహుతి కార్యక్రమంతో బ్రహోత్సవాలు ముగియున్నాయన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో వేంకటేశ్వర సన్నిధిలో బ్రహోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. వెల్ల సత్యనారాయణ, పసలపూడి శ్రీనివాసు, నామాల రామకృష్ణ, ఆలయ పురోహితులు పివివిఎస్. ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు పెట్టొద్దు



మాచవరంలో మద్యం షాపు ఏర్పాటు చేయవద్దంటూ నిరసన తెలుపుతున్న మహిళలు

మహిళల నిరసన

అంబాజీపేట: మాచవరం పీచు ఫ్యాక్టరీ వద్ద మద్యం షాపును పెట్టొందంటూ వెంకటేశ్వరకాలనీ, కుసుమ వారిపేట, చిన్న కుసుమవారిపేట మహిళలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. పీచు ఫ్యాక్టరీ వద్ద మద్యం షాపును ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు పనులు చేస్తున్నారని తక్షణమే వాటిని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తుందన్నారు. మద్యం షాపు ఏర్పాటు చేసే పీచు ఫ్యాక్టరికి ఆనుకుని ఈ మూడు పేటలలో రామాలయం, చర్చి, అంబేడ్కర్ విగ్రహాలు, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయన్నారు. మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల కూలి పనులకు వెళ్లి వచ్చిన తమ భర్తలతో పాటు యువకులు మద్యానికి బానిసలవుతారన్నారు. కూలి పనులకు వెళ్లి వచ్చే మహిళలకు అసౌకర్యంగా ఉంటుందని, ఎట్టి పరిస్థితుల్లోను నివాస ప్రాంతాల సమీపంలో మద్యం షాపుని పెట్టవద్దని నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. మద్యం షాపు ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తే ఆందోళన చేసేందుకు వెనుకాడమని మహిళలు హెచ్చరించారు.

వీఆర్వోలకు తహసీల్దార్ పరిధిలోనే జీతాలు చెల్లించాలి

పి.గన్నవరం: గ్రేడ్–1, గ్రేడ్–2 వీఆర్వోలకు తహసీల్దార్ పరిధిలోనే జీతభత్యాలు చెల్లించాలని కోరుతూ మండలంలోని వీఆర్వోలు సోమవారం పి.గన్నవరంలో తహసీల్దార్‌కు శ్రీపల్లవికి వినతిపత్రం సమర్పించారు. అలాగే వీఆర్వోలకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల వీఆర్వోల సంఘ నాయకులు పి.నర్సింహరావు, కె.దొరబాబు, కె.భగన్నారాయణ, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

వృత్తి కళాకారులకు సన్మానం

మామిడికుదురు: కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని కోనసీమ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ పేర్కొన్నారు. కోనసీమ వృతి కళాకారుల సంక్షేమ సంఘం సమావేశం మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో సోమవారం జరిగింది. సమావేశానికి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మంగం సత్యనారాయణ అధ్యక్షత వహించారు. కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన సంఘం సభ్యుడైన అడబాల సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన కళాకారుల కుటుంబానికి చెందిన డాక్టర్ ఎం.సింధు, సంఘం వ్యవస్థాపకులు సత్యనారాయణ, కళాకారులు కుడుపూడి జనార్దనరావు, అడబాల సత్యనారాయణలను ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, సంఘం గౌరవాధ్యక్షులు యాలి శ్రీనివాస్ చేతుల మీదుగా ఈ సన్మానం జరిగింది.

బీజేపీ కార్యాలయానికి స్థల విరాళం

మలికిపురం: బీజేపీ రాజోలు నియోజకవర్గ కార్యాలయ నిర్మాణం కోసం ఆ జిల్లా నాయకులు ఎఫ్‌సీఐ మెంబర్ దొడ్డా నాగబాబు మలికిపురంలో సుమారు పది లక్షల రూపాయలు విలువ చేసే రెండు సెంట్లు భూమిని వితరణ చేస్తున్నట్టు సోమవారం తెలిపారు. ఈ మేరకు పార్టీ నాయకులు సమక్షంలో ప్రకటించారు. సంబంధిత భూమిని పార్టీకి స్వాధీన పరుస్తున్నట్టు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మాజీ శాసనసభ్యులు మానేపల్లి అయ్యాజీ వేమ మాట్లాడుతూ మలికిపురం స్థానిక రెవెన్యూ కార్యాలయ సమీపంలో ఎంతో విలువైన భూమిని పార్టీ కోసం అంకితం చేయడంపై నాగబాబుకు ప్రత్యేక కతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, మండల పార్టీ అధ్యక్షుడు మేడిచర్ల చాణక్య, లక్కవరం నీటి సంఘం ఉపాధ్యక్షులు కాపిశెట్టి కనకేశ్వరరావు, కనుమూరు రమేష్ రాజు, కట్టా వాసు, గెద్దాడ పండు, అనిశెట్టి బాలాజీ, ఆరేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కొత్తపేట: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిలు పరిధిలో విస్తృతంగా దాడులు జరిపి సుమారు వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కే కాత్యాయని తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై కే అన్నవరం ఆధ్వర్యంలో సిబ్బంది నిర్వహించిన తనిఖీల్లో భాగంగా ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక గోదావరి లంకలో బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు.

అనుబంధ విభాగాలతో పార్టీ బలోపేతం



వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన అనుబంధ విభాగాల అధ్యక్షులు

రావులపాలెం: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలతో పార్టీని గ్రామ, బూత్ స్థాయిల నుంచి మరింత బలోపేతం చేయాని ఆ దిశగా బాధ్యతలు తీసుకున్న అనుబంధ విభాగాల అధ్యక్షుడు కృషి చేయాలని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిర్ల జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల పార్టీ జిల్లా, అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన కార్యకర్తలు, నాయకులు సోమవారం సాయంత్రం గోపాలపురంలో జగ్గిరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని జగ్గిరెడ్డి దుశ్శావాలు, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. నూతనంగా నియమించిన వివిధ విభాగాల అధ్యక్షులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు మన్యం వీరబాబు, అలాగే కొత్తపేట నియోజకవర్గ సోషల్ మీడియా విభాగం నెల్లి రాజు, మైనారిటీ సెల్ విభాగం విజయ సుందరం, గ్రీవియన్స్ విభాగం నాయుడు ప్రసాద్, కార్మిక విభాగం అలుగోజు శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ విభాగం కంపసతి పట్టాభిలు జగ్గిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తమపై ఉన్న నమ్మకాన్ని బాధ్యతగా నిలుపుకొంటామని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా జగ్గిరెడ్డిని ఎమ్మెల్యేగా చేసే వరకూ శ్రమిస్తామన్నారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం కష్టపడే ప్రతి నాయకుడికి, కార్యకర్తకి కచ్చితంగా సముచిత స్థానం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. 2019 నుంచి 2024 మధ్యలో కార్యకర్తలు నిరుత్సాహం పడిన విషయాన్ని తెలుసుకుని జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కార్యకర్తకు పెద్దపీట వేస్తానని చెప్పారన్నారు.

నులి పురుగు నివారణతో సంపూర్ణ ఆరోగ్యం



కొత్తపేటలో విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న ఎంఈఓ హరిప్రసాద్



పెదపట్నంలంకలో విద్యార్థులకు మాత్రలు అందిస్తున్న ఉద్యోగులు



పెనికేరులో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను అందిస్తున్న వైద్యాధికారి సాయికిషోర్

- నులిపురుగుల నిర్మూలన దినోత్సవం
- పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కొత్తపేట: విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తారని మండల విద్యాశాఖాధికారి మట్టపర్తి హరిప్రసాద్ అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని వానపల్లి, అవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) ద్వారా ఆయా పీహెచ్‌సీల సిబ్బంది మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల బాలలకు ఆల్బెండాజోల్ మాత్రలను మింగించారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఎంఈఓ హరిప్రసాద్ పలువురు విద్యార్థినులకు మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి పరిశుభ్రత ప్రధానమన్నారు. అవిడి పీహెచ్‌సీ పరిధిలో 35 ప్రభుత్వ, 14 ప్రైవేట్ పాఠశాలలు, 2 ప్రభుత్వ, 4 ప్రైవేట్ కళాశాలలు, 35 అంగన్‌వాడీ కేంద్రాలలో మొత్తం 8,184 మందికి 7,875 (96.02 శాతం) మందికి మాత్రలు వేసినట్టు ఆ పీహెచ్‌సీ సిబ్బంది తెలిపారు.


మాత్రల పంపిణీ

మామిడికుదురు: జాతీయ నులి పురుగుల నివారణలో భాగంగా సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఒకటి నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన విద్యార్థులకు ఈ మాత్రలు మింగించారు. నగరం పీహెచ్‌సీ పరిధిలోని 11 సచివాలయాల్లో 9,654 మందికి ఈ మాత్రలు పంపిణీ చేయాల్సి ఉంది. ఇక్కడ 9,365 మందికి మాత్రలు మింగించారు. లూటుకుర్రు పీహెచ్‌సీ పరిధిలోని 11 సచివాలయాల్లో 2,851 మందికి మాత్రలు అందించారు. 95 శాతం పైబడిన వారికి మాత్రలు మింగించామని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు తెలిపారు. సచివాయాల స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

అవగాహనతో నులిపురుగుల నిర్మూలన

ఆలమూరు: బాలల శారీరక క్షీణతకు కారణమయ్యే నులిపురుగుల నిర్మూలన కోసం అవగాహనతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, డి.సాయి కిషోర్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయా పీహెచ్‌సీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల్లో సోమవారం ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేశారు. మండలంలోని రెండు పీహెచ్‌సీ పరిధిలో 12139 మంది బాలలకు ఆల్‌బెండజోల్ మాత్రలను అందించవలసి ఉండగా అందులో 96.1 శాతం మేర 11672 మందికి పంపిణీ చేశారు. పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో 5457 మందికి గాను 5263, చొప్పెల్ల పీహెచ్‌సీలో 6682 మందికి గాను 6409 మంది చేత ఆల్‌బెండజోల్ మాత్రలను మింగించారు. మిగిలిన బాలలకు ఈనెల 17న ఆల్‌బెండజోల్ మాత్రలను అందించనున్నామని వైద్యాధికారులు తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఏవివి.రాజా, బి,సూర్యనారాయణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఆర్,బాలామణి పాల్గొన్నారు.

కిశోర బాలికల వికాసానికి తోడ్పాటు



ఆలమూరులో బాలికా వికాసంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ తదితరులు

ఆలమూరు: కిశోరి బాలికల వ్యక్తిత్వ వికాసామే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలకు తోడ్పాటును అందించాలని ఎంపీడీఓ ఏ రాజు, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ అధికారి గజలక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరులో ఉన్న బొబ్బా జయశ్రీ బాలికల ఉన్నత పాఠశాల సోమవారం కిశోరి వికాసం కార్యక్రమం జరిగింది. గ్రామ అంగన్‌వాడీ సమాఖ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టీఎన్‌వీ నాగలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొని కిశోరి బాలికల వికాసానికి తీసుకోవలసిన చర్యలపై ప్రసంగించారు. అనంతరం ఇప్పటికే నియమించిన వెల్ఫేర్ అసిస్టెంట్, అంగన్‌వాడీ కార్యకర్త, ఉపాధ్యాయుడు, మహిళా పోలీసు బృందం హైస్కూల్ ఆవరణలో విద్యార్థినులతో సమావేశమై కిశోరి వికాసం ఆవశ్యకతను వివరించారు. వైద్యాధికారి డి.సాయికిశోర్, ఎంఈఓ భమిడిపాటి అప్పాజీ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.